



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న నాయకులు

వ్యవసాయం, ఉపాధికి కోత దుర్మార్గం

- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు - కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, ఉపాధి హామీ చట్టానికి కోత విధించడం దుర్మార్గమని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు జి.రామకృష్ణ, కెవి.నారాయణ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ముందు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శులు జి.రామకృష్ణ, కెవి.నారాయణ మాట్లాడారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెట్టివేసిందని తెలిపారు. రైతులకు సంబంధించి ఎరువుల సబ్సిడీ ఊసే లేదన్నారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేశారని, కానీ స్వామినాథన్ సిఫారసు కమిటీల మేరకు కనీస మద్దతు ధర గురించి మాట్లాడలేదని తెలిపారు. అహర్నిశలు శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ చట్టం ఉందని, దీనివల్ల అనేక మంది పేదలకు తిండి దొరుకుతుందని తెలిపారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేలాగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచిందని మండిపడ్డారు. కర్నూలు మండల నాయకులు పిబి.హుస్సేనయ్య, నరసింహులు, మధు, మస్తాన్, మాసుం పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్) :** ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ సచివాలయం వద్ద ఎపి రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి మధుసూదన్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దివాలాకోరు బడ్జెట్‌గా ఉందని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీఇచ్చిందని చెప్పారు. అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు దాటినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. మాసుం బాష, ఆంజనేయులు, బషీర్, రాజేష్, సంజీవ, రోషన్న, బొజ్జన్న, రైతులు పాల్గొన్నారు.

'ఆడా'.. నీ జాడ ఎక్కడ..?

- ఏర్పాటై ఏడాదైనా ప్రయోజనం శూన్యం.. - కలగానే మిగిలిన కరువు, వలసల నివారణ...
- పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై శీతకన్ను - ఫలితం ఇవ్వని మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేల సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం కరువు, కాటకాలకు నిలయమైంది. ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాలు మారడం లేదు. వలసలను నివారించి, ఉన్నచోటే ఉపాధి కల్పించి మెరుగైన జీవితం అందిస్తామని ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ బోర్డు కూడా ఇక ముగిసిన అధ్యాయంగానే మిగిలింది. బోర్డు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయి, లక్ష్యం చేరుకోవడంలో ఓనమాలు కూడా దిద్దడం లేదని ప్రజాసంఘాల నాయకులు, విశ్లేషకులు విమర్శిస్తున్నారు. అసలు 'ఆడా' జాడే లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. 'ఆడా'కు కేవలం ప్రత్యేకాధికారిని నియమించారే తప్ప ఎలాంటి నిధులూ కేటాయించలేదు. కరువు నివారణ, వలసలను అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా బోర్డును ఏర్పాటు చేశారు. ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో ఈఏడాది కూడా డివిజన్ నుంచి దూర ప్రాంతాలకు వేల సంఖ్యలో వ్యవసాయ కూలీలు వలస బాట పట్టారు.

డివిజన్ అంతా ఇదే పరిస్థితి

ఆదోని డివిజన్ మంత్రాలయం నియోజక వర్గంలోని కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం, మంత్రాలయం నుంచి ఇప్పటికే సుమారు 10 వేల మందికి ఉపాధి కోసం గుంటూరు, హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లారు. ఆదోని మండలం నుంచి ఇప్పటికే వ్యవసాయ కూలీల వలస బాట ప్రారంభమైందని, మండలంలోని ఆయా గ్రామాల నుంచి కనీసం 3 వేల మంది వలస వెళ్లి ఉంటారని అంచనా. ఆడా ఏర్పడి ఏడాది గడిచినా నవంబర్ 5, 2022న ఆదోని కేంద్రంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, కలెక్టర్ కోటేశ్వరరావుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మెల్యేలు వై.సాయి ప్రసాద్ రెడ్డి, చెన్న కేశవరెడ్డి, బాలనాగిరెడ్డి, శ్రీదేవి, ఆదోని సబ్ కలెక్టర్, జెసి, డివిజన్ స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ బోర్డు పరిధిలోని ఆయా మండలాల అభివృద్ధికి, కరువు, వలసల నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని ప్రకటించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అందరూ భావించారు. సమావేశాలకే పరిమితమైందే తప్ప నివారణ కోసం ప్రత్యేక నిధులు ఇచ్చిన దాఖలాల్లేవు.

వలసలు షరా మామూలే...

2023లో వలసల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక పంపమని అధికారులు చెప్పినా ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ఎమ్మెల్యేలు, మంత్రి, కలెక్టర్ చర్చించి ముఖ్యమంత్రికే ప్రత్యేక నివేదిక పంపినట్లు అప్పట్లో ప్రకటించారు. మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలూ లేకపోవడంతో వలసలు మొదలయ్యాయి. ఇక పశ్చిమ ప్రాంతం మరింత వెనుకబాటు గురయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు కలెక్టర్, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకున్న దాఖలాలు లేవు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఆదోని పశ్చిమ ప్రాంతం ఉండేది. ఆదోని పశ్చిమ ప్రాంత పరిధిలో దాదాపు 17 మండలాలు ఉండేవి. ఇటీవల జిల్లాల పునర్విభజన ప్రక్రియలో కొత్తగా పత్తికొండ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. ఆ డివిజన్‌లోకి 8 మండలాలు వెళ్లడంతో ఇప్పుడు 9 మండలాలతో ఆదోని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా అవతరించింది.



కౌతాళం మండలంలో వలస వెళ్తున్న కూలీలు (ఫైల్)

పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ బోర్డు (ఆడా)ను ఏర్పాటు చేసింది. ఈ బోర్డుకు ఐఎఎస్ ఆఫీసర్, స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. ఇందులో కీలక శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రజాప్రతినిధులు కూడా బోర్డు పరిధిలో జరిగే సమావేశాలకు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వొచ్చు. ఈ బోర్డు నుంచి వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తే వాటిని ఆచరణలోకి తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ బోర్డు ఏర్పాటైన తర్వాత 2, 3 సార్లు మాత్రమే సమావేశం నిర్వహించారు. గతంలో ఈ బోర్డుకు స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ వ్యవహరించారు. ఆమె అన్నమయ్య జిల్లాకు జెసిగా బదిలీ అయ్యారు. అనంతరం ఆదోని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఒకసారి సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా నంద్యాల జెసి నారపరెడ్డి మౌర్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతానికి ఆమె కేవలం స్పెషల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలతో పర్యవేక్షిస్తున్నప్పటికీ ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ బోర్డుకు స్పెషల్ ఆఫీసర్‌గా ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వ్యవహరిస్తున్నారు.

అన్ని రంగాల్లో వెనుకంజ...


ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు లేకపోవడంతో రైతులు కేవలం ఒక్క కారు పంటలను మాత్రమే సాగు చేస్తారు. ఆదోని డివిజన్‌లోని కౌతాళం, కోసిగి, ఆదోని, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు, హోళగుంద, హాలహర్వి మండలాలకు సాగు, తాగునీటిని అందించేందుకు తుంగభద్ర నది ఉన్నా రైతులకు ప్రయోజనం చేకూరడం లేదు. దిగువ కాలువ నుంచి సాగునీరు అందుతాయో లేదోనని రైతులు కేవలం ఒక్క కారు మాత్రమే పంట పండిస్తారు. ఇక్కడ వ్యవసాయ పనులు లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధి కూడా అంతంతమాత్రమే. అనేక గ్రామాల్లో పాఠశాలలు ఉన్నా విద్యార్థులకు బోధన చేసేందుకు అవసరమైన ఉపాధ్యాయులు లేకపోవడంతో అక్షరాస్యత శాతంగా ఈ ప్రాంతం వెనుకంజలో నిలిచింది.

నీటి సౌకర్యం అంతంతే

తుంగభద్ర దిగువ కాలువ నుంచి ఖరీఫ్, రబీ సీజన్‌లో పూర్తిస్థాయిలో సాగునీరు అందుతాయన్న నమ్మకం, భరోసా రైతులకు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. తుంగభద్ర దిగువ కాలువ నుంచి ప్రతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పూర్తిస్థాయి వాటాను సాధించి అందిస్తామన్న నమ్మకం రైతులకు కల్పిస్తే ఈ ప్రాంతంలో పంటలు పండిస్తూ కూలీలు వలస వెళ్లకుండా ఉంటారు. ఇదే తుంగభద్ర దిగువ కాలువ నుంచి కర్ణాటక ప్రాంతంలో వర్షాకాలం, ఎండాకాలం అన్న తేడా లేకుండా పంటలను సాగు చేస్తూ పచ్చని పొలాలతో ఆ ప్రాంతం కళకళలాడుతోందని చెబుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులు ప్రధానంగా వేదవతి, గుండ్రేవులను నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. ఈ ప్రాంతంలో ఒకప్పుడు కాటన్ మిల్లు పరిశ్రమలకు పెట్టింది పేరు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేకపోవడంతో మిల్లులు మూతపడ్డాయి. ఈ ప్రాంతంలో అత్యధికంగా పత్తిని సాగు చేస్తారు. పంటలను సాగు చేసిన మద్దతు ధర లభించకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వలసలు నివారించడమే కాకుండా, తుంగభద్ర దిగువ కాలువ నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు సాధించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కంటితుడుపు చర్యలు వద్దు

- ఈరన్న, సిపిఎం సీనియర్ నాయకులు



ఆదోని ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశిస్తే సరిపోదు. సాగునీటి వసతి, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రయోజనం ఉంటుంది. ఉత్తుత్తి సమావేశాలతో కాలయాపన చేసి ప్రజలను మోసం చేసే ప్రయత్నం మానుకోవాలి. పరిశ్రమలు మూతపడి ఉపాధి లేక కార్మికులు రోడ్డున పడినా ప్రభుత్వాలు ఎలాంటి సహాయక చర్యలూ చేపట్టలేదు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉంది.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి

- రూ.2.27 లక్షల విలువ గల గంజాయి ధ్వంసం
- అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లాలో గంజాయిని నిర్మూలించేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించారని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్ తెలిపారు. గురువారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పర్యవేక్షణలో భారీగా గంజాయిని ధ్వంసం చేసి నిప్పంటించి తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోని మొత్తం 5 కేసుల్లోని 15 మంది నిందితుల నుంచి 45 కిలోల 310 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిని కర్నూలు నగర సమీపంలోని దిన్నెదేవరపాడు దగ్గర ఉన్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ధ్వంసం చేశామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాపర్టీ మొత్తాన్ని కోర్టు మెజిస్ట్రేట్ అనుమతితో, ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం ప్రొసిడింగ్స్ చేసి పంచనామా ప్రకారం ధ్వంసం చేసి కాల్చేశామన్నారు. తగులబెట్టిన గంజాయి విలువ రూ.2.27 లక్షలు ఉంటుందని తెలిపారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమిటీని ఏర్పాటు చేసి ప్రత్యేక పోలీసు బృందాలతో స్లమ్ ఏరియాలతో పాటు, కళాశాలల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ (నోడల్ ఆఫీసర్) డీఎస్పీ యుగంధర్ బాబు, సిసిఎస్ డీఎస్పీ (కమిటీ మెంబర్) శ్రీనివాసులు, సిఐలు జాన్సన్, శివశంకర్, ఎస్ఐలు మన్మథ విజయ్, పెద్దయ్య నాయుడు ఉన్నారు.



గంజాయిని ధ్వంసం చేస్తున్న పోలీసులు



వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

మున్సిపల్ షాపులకు బహిరంగ వేలాలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని షాపులకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. సిక్యాంపులో ఉన్న జనరల్ కేటగిరి కింద 21-ఎ షాపును ఎ.పావని రూ.9,63,600లకు, మద్దూర్ నగర్‌లోని జనరల్ కేటగిరీ కింద 17 షాపును జి.పృథ్వీరాజ్ రూ.4.50 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. రెండు షాపులకు మొత్తం రూ.14 లక్షలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ వేలం పాటలను రెవెన్యూ అధికారి జునైద్, ఆర్ఐ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎండి అన్వర్ హుస్సేన్

ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ల చేతిలో..

- డాక్టర్ ఎండి అన్వర్ హుస్సేన్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రయాణికుల ప్రాణాలను కాపాడే దేవుళ్లు డ్రైవర్లని డాక్టర్ ఎం. అన్వర్ హుస్సేన్ అన్నారు. గురువారం ప్రజా రోడ్డు రవాణా సంస్థ 34వ రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సమావేశం టు డిపో గ్యారేజ్‌లో జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ సిటిఎం కెవి రమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎండి అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ డ్రైవర్లు జాగ్రత్తగా, ఏకాగ్రతగా బస్సులు నడిపి ఉత్తమ డ్రైవర్లుగా అయ్యారంటే వారు ఎలాంటి చెడు అలవాట్లకు లోను కాకుండా ఉంటూ ఆరోగ్యంగా ఉండటమేనని చెప్పారు. ఆర్టీవో ఎస్.రమేష్ మాట్లాడుతూ ప్రమాదం జరిగాక ఆ కుటుంబం బాగుపడాలంటే ఒక తరం పడుతుందన్నారు. డ్రైవరు వాహనం నడిపేటప్పుడు సమయపాలన, ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. ప్రజా రవాణా ప్రాంతీయ అధికారి టీవీ రామం ప్రజలకు ఆర్టీసీపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి పేరు తేవాలని చెప్పారు. డిప్యూటీ సీఎంఈ రజియా సుల్తానా మాట్లాడుతూ వాహనాల కండీషన్లో వచ్చిన మార్పులు వివరించారు. అనంతరం 30 సంవత్సరాల ఐదు నెలల సర్వీసులో ఒక్క ప్రమాదం కూడా చేయకుండా ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికై మొదటి బహుమతిని అందుకున్న టీఎస్ నారాయణకు రూ.1500 నగదు, ద్వితీయ బహుమతి సివిబి రెడ్డికి రూ.1250, జిఎస్ బాబుకు రూ.1000 నగదు బహుమతులతో ఘనంగా సత్కరించారు. అలాగే ఆదోని, కర్నూలు వన్ అండ్ టూ, ఎమ్మిగనూరు, పత్తికొండ డిపోలలోని 15 మంది ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వన్ డిపో మేనేజర్ సుధారాణి, వివిధ డిపోల డ్రైవర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్ మండలంలో 'అవీ - ఇవీ'

ప్రజాశక్తి - సి బెళగల్

- రానున్న రోజుల్లో బీజేపీ విధానాలు భయంకరంగా ఉంటాయని ఐక్య పోరాటాలతో తగిన బుద్ధి చెప్పాలని సిపిఐ మండల కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. గురువారం వైసిపి, బిజెపి నేతలపై మండిపడ్డారు.
- గొల్లలదొడ్డిలో ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్డీ సందీప్ సచివాలయం తనిఖీ చేశారు. ఆర్బీకే సేవలు, ఈకేవైసి, పిఎంజేవై పథకాలు సక్రమంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.
- నేడు సి.బెళగల్‌లో చింతలముని నల్లారెడ్డి స్వాముల నూతన ఆలయం ప్రతిష్ఠాపన జరగునని గ్రామపెద్దలు మీడియాకు తెలిపారు.
- బెళగల్‌లో తెలుగు మహేష్‌కు చెందిన గడ్డి వాము అగ్నికి అహుతయింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

బడ్జెట్ బాగుందని ఏం చూసి చెప్పారో..?

- ఆర్థిక మంత్రి సమాధానం చెప్పాలి
- సిపిఎం జిల్లా కమిటీ సూటి ప్రశ్న

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ఆర్థిక మంత్రి నిన్నటి రోజు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగుందని రాష్ట్ర ఆర్థికం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం ఆశ్చర్యాన్ని గురి చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవైపు వైసిపి ఎంపీ మిథున్ రెడ్డి కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదని, విభజన హామీల పరంగా నిరాశే మిగిలిందని పోలవరానికి నిధులు కేటాయించకపోవడం బాధ కలిగించిందని పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారని, ఒకే పార్టీలో ఉన్న ఇద్దరు ముఖ్యమైన వ్యక్తులు విభిన్న ప్రకటనలు చేసి ఎవరిని మోసం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆర్థిక మంత్రి బుగ్గన ఆంధ్ర రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం వల్ల బడ్జెట్ బాగుందని చెప్పారా ? పోలవరం ప్రాజెక్టు ప్రస్తావన లేకుండా బడ్జెట్ ప్రసంగం సాగినందుకు బాగుందని చెప్తున్నారా ? వెనకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా మోసం చేసినందుకు బాగుందని చెప్తున్నారా? కర్ణాటకలో అపరభద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించి రాయలసీమకు ద్రోహం చేసినందుకు బాగుందని చెప్తున్నారా ? కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి 89 వేల కోట్ల నుండి 60 వేల కోట్లకు తగ్గించినందుకు బాగుందని చెప్తున్నారా? ఆహార భద్రతకు రెండు లక్షల 87 వేల కోట్ల నుండి లక్ష 97 వేల కోట్లకు కుదించిందని, గ్రామీణణ పేదలకు తీవ్రమైన నష్టం కలిగించినందుకు బాగుందని చెప్తున్నారా? దేనికి బాగుందని చెప్తున్నారో ఆర్థిక మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో నిర్మితమవుతున్న రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ నిధుల ప్రస్తావన కూడా లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఈ బడ్జెట్ రాబోయే కాలంలో ఎన్నికల్లో లబ్ధి చేకూర్చేందుకు ఉపయోగపడే విధంగా కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సవరించి ఆంధ్ర రాష్ట్రానికి వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్మికుల, ప్రజల వ్యతిరేక బడ్జెట్ : సిఐటియు

కార్మికుల పట్ల ప్రజల పట్ల వ్యతిరేకతో కూడిన బడ్జెట్‌గా కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ ఉందని సిఐటియు జిల్లా కమిటీ విమర్శించింది. అమృతకాలంలో పెట్టిన విషపూరిత బడ్జెట్ అని వ్యాఖ్యానించింది. ఉపాధి హామీకి రూ.30 వేల కోట్లు కోత విధించి గ్రామీణ శ్రామికులకు పని లేకుండా చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని జిల్లా కమిటీ విమర్శించింది. ఆహార సబ్సిడీకి 31 శాతం కోత విధించడం వల్ల తక్కువ రేట్లతో సరఫరా చేసే ఆహార పదార్థాలు పేద ప్రజలకు దక్కకుండా చేస్తుందని అభిప్రాయపడింది. నిరుద్యోగ సమస్య గురించి గానీ ధరల పెరుగుదల గురించి గానీ పరిష్కారం చూపడంలో కేంద్ర బడ్జెట్ విఫలమైందని అభిప్రాయపడింది కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ విద్యా మిషన్ లాంటి పథకాలకు కేటాయింపులలో కోత విధించిందని తెలియజేసింది. అసంఘటితరంగా కార్మికులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి సంక్షేమ పథకాలను కార్మికులందరికీ అమలు చేయాలన్న కార్మికుల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ కొన సాగించాలని ప్రయత్నిస్తున్నట్లు బడ్జెట్లో కనబడుతుందని అభిప్రాయపడింది. పట్టణ మౌలిక సదుపాయాల కొరకు బడ్జెట్ ని కేటాయించిన ప్రభుత్వం ఆ సౌకర్యాలను అందుకోవాలంటే ప్రజల దగ్గర నుంచి యూజర్ చార్జీలు వసూలు చేసుకోవాలని మెలిక పెట్టడం ద్వారా ప్రజలపై మరింత భారం బడే ప్రమాదం ఉందని పేర్కొంది. బడ్జెట్‌ను సవరించి ప్రజలకు అనుకూలమైన విధంగా బడ్జెట్లో కేటాయించాలని ఉపాధి కల్పనా ప్రాజెక్టులలో ప్రభుత్వం పెట్టుబడులను గణనీయంగా పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీకి కేటాయింపులు గణనీయంగా పెంచి కార్మికులకు వేతనాలు పెంచాలని ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని, ఐదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలతో పాటు ఐదు కిలోల సబ్సిడీ ఆహార ధాన్యాలను పునరుద్ధరించాలని, సంపద వారసత్వపు పన్నులను విధించాలని డిమాండ్ చేసింది. కార్మికులు ఎక్కడికక్కడ కార్మికులు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో పెట్టిన కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. **పత్తికొండ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు అమృతంలా కాకుండా పెనుభారంగా విష గుళికలా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెద్దహుల్తి సురేంద్ర విమర్శించారు. వ్యకాసం, ఇతర ప్రజా సంఘాలు కలిసి ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బడ్జెట్ సవరణలో గ్రామీణ ఉపాధి హామీ పథకంకు, ఆహార భద్రతకు, పేద ప్రజలకు, నిర్మాణాలకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు.

ఆనందం.. ఉత్సాహం.. ఉల్లాసం..

2023-బాలోత్సవానికి రంగం సిద్ధం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఆనందం, ఉత్సాహం, ఉల్లాసం ప్రధాన అజెండాగా పిల్లలు ఆనందంగా తమ కళా ప్రదర్శనలు చేయవచ్చని బాలోత్సవం-2023 నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి జెయన్ శేషయ్యలు, కన్వీనర్లు కెంగార మోహన్, యంపి బసవరాజులు ప్రకటించారు. బాలోత్సవం కన్వీనర్ యంపి బసవరాజు అధ్యక్షతన నగరంలోని లలితకళా సమితిలో గురువారం ఉదయం 10.30కు నిర్వహణ కమిటీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆహ్వాన సంఘం గౌరవ సలహా దారులు పత్తిఓబులయ్య మాట్లాడుతూ బాలోత్సవాలను ఒక పండుగలా నిర్వహిస్తున్నామని, 2020లో చేసిన చిన్నారుల పండగ నగరవాసులను అబ్బురపరచిందని తెలిపారు. మళ్లీ కరోనా కారణంగా నిర్వహించలేదన్నారు. ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో సమిష్టిగా పిల్లల పండుగను చరిత్రలో నిలిచిపోయేలా చేద్దామన్నారు. ఈ పండుగ విజయవంతానికి అన్నీ విధాల సహకరిస్తానన్నారు. నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి జెయన్ శేషయ్య మాట్లాడుతూ పిల్లలను సృజనాత్మక శక్తులుగా, ఆలోచనాపరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది, తల్లి దండ్రులదే నన్నారు. ఆట, పాట, సందడి త్రిముఖవ్యూహాలుగా ప్రణాళికలు సిద్ధం చేశామని, పోటీ అన్నది సాధారణంగా తీసుకునే అంశం మాత్రమేనన్నారు. ముఖ్యంగా కళారంగంలో గెలుపు ఓటములన్నవి మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్నిస్తాయన్నారు. సమావేశంలో బాలోత్సవం నిర్వాహక కమిటీని సభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. బాలోత్సవ తేదీలను త్వరలో ఆహ్వాన సంఘం ప్రకటిస్తుందని నిర్వహణ కమిటీ అధ్యక్షకార్యదర్శులు వివరించారు. బాలోత్సవం ప్లానింగ్ కన్వీనర్‌గా కెంగార మోహన్, కల్చరల్ కన్వీనర్‌గా యంపి బసవరాజులను సభ ఎన్నుకున్నది. నిర్వాహక కమిటీలో కె.సురేష్ కుమార్, యస్‌యం జయరాజు (యూటిఎఫ్), నరసింహ, వినయ్‌కుమార్ (ప్రజాశక్తి), జె.రంగ స్వామి (సుందరయ్య స్ఫూర్తి కేంద్రం), ఆవుల చక్రపాణియాదవ్, విజయులు తనగల (సాహితీ స్రవంతి), నాగేష్ (డివైఎఫ్ఐ), రంగప్ప (ఎస్ఎఫ్ఐ), ఉమ (కెసిఎఫ్)లు పాల్గొన్నారు. సమావేశంలో యూటిఎఫ్ నాయకులు మద్దిలేటి, యూఆర్‌ఏ రవి కుమార్, నవీన్‌పాటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

రోడ్డు ప్రమాదాలు నియంత్రించండి : ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

సమిష్టి కృషితో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అన్నారు. నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు తీసుకున్న చర్యల వివరాలను గురువారం విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 1,016 కేసులు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 7,721, మైనర్లపై 66, ఒన్ వేలో రాంగ్ రూట్ వెళ్ళిన వారిపై 157, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై 253, జంపింగ్ సిగ్నల్ 7, ఏలాంటి రికార్డులు పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారిపై 12,120, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహన చోదకులపై 552, అతి వేగం 2,618, ఓవర్ లోడ్ 385, త్రిబుల్ రైడింగ్ పై 1,351, రాంగ్ పార్కింగ్ టు వీలర్ 1,290, త్రీ, ఫోర్ వీలర్ 701 కేసులు నమోదు చేశామన్నారు. నంబర్ ప్లేట్ లేనివి 556 వాహనాలను సీజ్ చేశామన్నారు. డ్రంకెన్ డ్రైవింగ్‌పై 52 కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం 5 లక్షల 38 వేల ఈ-చలనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెలలో 34,589 ఈ-చలనాలను (రూ.72 లక్షల 87 వేల 965) రికవరీ చేశామన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి సిద్ధార్థ కౌశల్

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పెసలబండ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీఇచ్చారు. వైసిపి ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ నిష్పక్షపాతంగా అందిస్తున్నామని తెలిపారు. ఆర్‌డబ్ల్యుసి ఎఇ నాగమల్లయ్య, ఇఒఆర్‌డి జనార్ధన్, ఎపిఒ చంద్రశేఖర్, ఎపిఎం జనార్ధన్, హౌసింగ్ బోర్డు అధికారి తిప్పన్న పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబానికి ఆర్థికసాయం

మండలంలోని ఆరెకల్లు గ్రామానికి చెందిన రైతు గోవిందురెడ్డి గారి నాగిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. నాగిరెడ్డి అప్పులబాధ తాళలేక 2022లో ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత రైతు కుటుంబానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. రైతు భార్య గోవిందు రెడ్డి జయలక్ష్మికి ప్రభుత్వం నుంచి రూ.7 లక్షల మెగా చెక్కును అందజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదోని ఎం.గిరీష్, ఎఒ పాపిరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

- ఎంపిడిఒ సుధాకర్ రాజు, ఇఒఆర్‌డి సంజన

ప్రజాశక్తి - చిప్పగిరి


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న అధికారులు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని ఎంపిడిఒ సుధాకర్ రాజు, ఇఒఆర్‌డి సంజన్న పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ సుధాకర్ రాజు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెలాఖరుకు ఇంటి గుత్త, నీటి పన్ను వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. అవుట్‌రిచ్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని చెప్పారు. సచివాలయ అధికారులను, వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు నాగభూషణం, బాలన్న, సిసింద్రీ, జయరాం నాయక్, సుధీర్, సురేంద్ర, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

బిటి రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

- రోడ్డుపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఆస్పరి


హాలిగేరి రోడ్డుపై నిరసన చేపడుతున్న నాయకులు

మండలంలోని హాలిగేరి గ్రామానికి వెళ్లే బిటి రోడ్డు గుంతలు పడి వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, బాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో హాలిగేరి రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా గ్రామానికి వెళ్లే రోడ్లు మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడి ఆదోని, పత్తికొండ రోడ్డు నుంచి గ్రామంలోకి బిటి రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీ మాటలకే పరిమితమైందని విమర్శించారు. రాజకీయ నాయకులకు ఓట్లపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో లేదని మండి పడ్డారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి హాలిగేరి గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేకపోతే ఆర్‌అండ్‌బి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు రాముడు, రామాంజనేయులు, గణేష్ పాల్గొన్నారు.

రూరల్ సిఐగా మోహన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరు రూరల్ సిఐగా మోహన్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకొస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కడప జిల్లా ముద్దనూరు నుంచి ఎమ్మిగనూరుకు బదిలీ అయినట్లు తెలిపారు.

పంచాయతీలో మధ్యవర్తులదే హవా..

- సచివాలయం ఏర్పాటు చేసినా మారని తీరు - ప్రతి పంచాయతీలో ఇప్పటికీ మధ్యవర్తి ఉద్యోగి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. అందులో 11 శాఖలకు సంబంధించిన ఉద్యోగులను నియమించింది. ఇప్పటికీ గతంలో లాగానే మధ్యవర్తి ఉద్యోగులు పని చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా చెప్పకుంటూ గ్రామాల్లో వారు విధులు నిర్వహిస్తున్నారు.


ఎసిబికి పట్టుబడిన మధ్యవర్తి ఉద్యోగి షఫీ (వృత్తంలో)

ఆదోని మండలంలోని 37 పంచాయతీల్లో ఇప్పటికీ సుమారు 25 పంచాయతీల్లో మధ్యవర్తులుగా విధులు నిర్వహిస్తూ ప్రజలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరికి జీతాలు కూడా పంచాయతీల ద్వారానే ఇస్తున్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల కన్నా వీరికే అగ్రతాంబూలమనే విమర్శలూ ఉన్నాయి. పెద్దతుంబలం పంచాయతీలో మధ్యవర్తిగా విధులు నిర్వహిస్తున్న షఫీ రూ.10 వేల జీతం తీసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇలా అన్ని పంచాయతీల్లోనూ పంచాయతీ కార్యదర్శులకు మధ్యవర్తిగా ఉంటున్నారు. వీరు చెప్పిందే శాసనమన్నట్లుగా అధికారులు కూడా పనులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసినా వీరి ఉద్యోగం అలాగే కొనసాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మధ్యవర్తులను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు

గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని, సమగ్ర సమాచారం సేకరించి, ప్రజాప్రతినిధులకు అందజేసేందుకు, ప్రజలకు, ప్రభుత్వానికీ వారధిగా ఒక ప్రభుత్వ ఉద్యోగి అవసరాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీకీ ఒక కార్యదర్శిని నియమించింది. దీనిని 01-01-2002 నుంచి అమలులోకి తెచ్చింది.

పంచాయతీ కార్యదర్శి విధులు

పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ఆధీనంలో పని చేయాలి. సర్పంచి ఆదేశాల మేరకు పంచాయతీని సమావేశ పరచాలి. పంచాయతీ సమావేశాలు, ఇతర కమిటీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలి. పంచాయతీ కమిటీల తీర్మానాలను అమలుచేయాలి. ఒకవేళ కార్యదర్శి దృష్టిలో ఏదైనా తీర్మానం చట్టానికి వ్యతిరేకంగా ఉన్నా, లేదా పంచాయతీ రాజ్ చట్టం పరిధిని దాటి ఉన్నా లేదా ప్రజాభద్రతకు, జీవితానికి, ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే విధంగా ఉన్నా అలాంటి విషయాన్ని కమిషనర్‌కు తగిన ఆదేశాల కోసం లేదా తీర్మానం రద్దు కోసం నివేదిక పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, పంచాయతీ ఆస్తులకు, భూములకు రక్షణ కల్పించాలి. గ్రామ చావడిలను నిర్వహించాలి. ప్రభుత్వ భూములను, భవనాలను ఇతర ఆస్తులు అన్యాక్రాంతం అయినప్పుడు లేదా ఇతరులు దుర్వినియోగం చేసినప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలి. పంచాయతీకి అవసరమైన రిజిస్టర్లు నిర్వహించాలి. పన్నులను వంద శాతం వసూలు చేయాలి. గ్రామసభకు సహాయపడాలి. పంచాయతీ కార్యదర్శులు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకొని వసూళ్లకు పాల్పడుతున్నారు. బుధవారం జరిగిన ఎసిబి దాడుల్లో దొరికిన పెద్దతుంబలం గ్రామానికి చెందిన షఫీనే ఇందుకు నిదర్శనం..!


పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఘనంగా సాళీబసయ్య మహోత్సవం

- ముఖ్యఅతిథిగా పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలో వెలసిన శ్రీసాళీబసయ్య ఆరాధన మహోత్సవాన్ని గ్రామ పెద్దల అధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి హాజరయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పూజారులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్నారు. టిడిపి నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, నవకోటి నారాయణ, లసుమయ్య, నర్సిరెడ్డి, రాముడు, వేమారెడ్డి, మల్లినర్సరెడ్డి, నరసింహులు, కాశీం, మహబూబ్, ముక్కన్న, ఐ టిడిపి నాయకులు సల్మాన్ రాజు, చిదానంద, నాగేష్ పాల్గొన్నారు.

ప్రతి రైతూ వేలిముద్ర వేయాలి


- ఎఒ ఆనంద్

ప్రజాశక్తి - చిప్పగిరి

పంటలు వేసుకున్న ప్రతి రైతూ ఈకేవైసీ చేయించుకున్నా వేలిముద్ర తప్పనిసరిగా వేయాలని ఎఒ ఆనంద్ రైతులకు సూచించారు. గురువారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో రైతు భరోసా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు కేవలం 20 శాతం మంది రైతులు మాత్రమే వేలిముద్ర వేశారని తెలిపారు. ఈనెల 15 నాటికి ప్రతి రైతూ వేలిముద్ర వేయాలన్నారు. వేలిముద్ర వేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే సబ్సిడీ, ఇన్‌పుట్, కరువు పరిహారం అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఇఒ రమాదేవి, ఆర్‌బికె సిబ్బంది రంగస్వామి, ప్రతాప్, సుబ్బరాయుడు, రాకేష్, వంశీ, సునీత, మనోహర్, బాష పాల్గొన్నారు.

'రబీ పంటల ఈకేవైసీ తప్పనిసరి'

దేవనకొండ : రబీ సీజన్‌లో పంటలు నమోదు చేసుకున్న ప్రతి రైతూ ఈకేవైసీ చేయించుకోవాలని పత్తికొండ ఎడిఎ విజయ మోహన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన దేవనకొండ రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులను ఇవ్వాలని తెలిపారు. రోజూ డిజిటల్ కియోస్క్‌ను ఓపెన్‌లో పెట్టాలన్నారు. సిఎం యాప్‌లో వేరుశనగ, పప్పు శనగ ధరలను రోజూ అప్‌డేట్ చేయాలని తెలిపారు. పిఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులతో పూర్తి చేయించాలని తెలిపారు. ఎఒ సురేష్ బాబు, ఎఇఒలు యోగేంద్ర, జయ రామ్, రంగన్న, విఎఎలు మల్లికార్జున, రంగన్న పాల్గొన్నారు.


రైతు భరోసా సిబ్బందితో మాట్లాడుతున్న ఎడిఎ

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-కోసిగి రూరల్

కోసిగిలోని 9వ వార్డులో నివాసం ఉంటున్న పందికోన శిలువయ్య బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. శిలువయ్య స్థానిక మౌంట్ కార్మెల్ (ప్రయివేట్) హైస్కూల్‌లో 20 ఏళ్లుగా ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. గతేడాది నుంచి తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో తిరుపతి హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స అనంతరం కోసిగికి వచ్చారు. వచ్చినప్పటి నుంచి ఆరోగ్యం కుదుటపడలేదు. బుధవారం ఆదోనికి వెళ్లే సమయంలో మార్గమధ్యంలో మృతి చెందారు. శిలువయ్య మృతి చెందారన్న విషయం తెలియడంతో స్కూల్ యాజమాన్యం నివాళులర్పించింది. చిన్న నాటి నుంచి కలిసిన చదువుకున్న స్నేహితులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగుదును కుటుంబ సభ్యులకు అందజేశారు. మౌంట్ కార్మెల్ యాజమాన్యం రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. శిలువయ్యలో అనుభవం, జ్ఞానం, విద్యార్థులను తీర్చిదిద్దే నైపుణ్యం, సామాజిక స్పృహ, అందరితో కలిసి పోయే నైపుణ్యం ఉందని కరస్పాండెంట్ ఫాదర్ షిజో కొనియాడారు. ఫాదర్ జాన్సన్, ఉపాధ్యాయులు రేణుక, శ్రీనివాసులు, సుందర రాజు, చిదానందలు నివాళులర్పించారు.

వైఎస్ఆర్ బీమా పేదలకు వరం

వైఎస్ఆర్ బీమా పేదలకు వరమని కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచి ఎస్.అయ్యమ్మ తెలిపారు. కోసిగిలోని 9వ వార్డులో నివాసం ఉంటున్న పందికోన శిలువయ్య (44) బుధవారం రాత్రి మృతి చెందారు. వైఎస్ఆర్ బీమాకు అర్హుడు కావడంతో మట్టి ఖర్చుల నిమిత్తం గురువారం రూ.10 వేలను సర్పంచి ఎస్.అయ్యమ్మ ఆదేశాల మేరకు వైసిపి యువజన నాయకులు రాజేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ వీరేష్ ఆధ్వర్యంలో నగుదును నామినీ అయిన మృతుని భార్య అమూజమ్మకు అందజేశారు. మిగిలిన నగదు రూ.90 వేలను నామినీ బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని వారు తెలిపారు. ఈ బీమా కుటుంబ సభ్యులకు అందడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి, మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు మాణిక్య రాజు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను మృతుని భార్య అమూజమ్మకు అందజేశారు. వాలంటీర్లు శాంతిరాజు, ఎస్‌కె.వెంకటేష్, నాయకులు అశోక్ పాల్గొన్నారు.


బీమా నగదు అందజేస్తున్న రాజేష్

వైఎస్ఆర్ పశు బీమాను పునరుద్ధరించాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు మల్లేష్

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమాను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు కె.మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గోవిందు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విజేత స్కూల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ పశు నష్టపరిహారం పథకం రద్దు చేసి దాని స్థానంలో జిఒ 3ను తీసుకు రావడం అన్యాయమని తెలిపారు. వైఎస్ఆర్ బీమా పథకం అమలులో ఉంటే ఒక్కో గొర్రెకు, మేకకు రూ.6 వేల నష్టపరిహారం అందేదని చెప్పారు. జిఒ 3 వల్ల మూగజీవాలు చనిపోయినా పరిహారం అందదని తెలిపారు. జిఒ 3 అమలులోకి వస్తే గొర్రెలు, మేకల పెంపకందారులు ప్రయివేట్ కంపెనీలకు బీమా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పల్లకి సేవ పునర్ ప్రారంభం

- ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్

ప్రజాశక్తి - కౌతాళం



జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో పల్లకి సేవలను పునర్ ప్రారంభించినట్లు ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజ్ గౌడ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు, భక్తుల కోసం పల్లకి సేవలు ప్రారంభించాలని ట్రస్ట్ బోర్డు సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. కరోనా సమయంలో ఈ సేవలను అధికారులు నిలిపేసినట్లు చెప్పారు. భక్తుల కోసం ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గురు, సోమవారం పల్లకి సేవ ఉంటుందని తెలిపారు. అలాగే ప్రతి అమావాస్య నాడు నిత్యాన్నదాన సత్రంలో రాత్రి సమయంలో భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

సిఐని కలిసిన జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సంగటి యోహాను ఆధ్వర్యంలో సిఐ శ్రీనివాసులును గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల మాట్లాడారు. దళిత, గిరిజనుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జిల్లా కార్యదర్శి రత్నం, నియోజకవర్గ నాయకులు మారెప్ప, మండల అధ్యక్షులు నరసింహులు, మండల నాయకులు అజయ్, పెద్ద నరసింహులు పాల్గొన్నారు.


సిఐని సన్మానిస్తున్న నాయకులు



గర్భిణులకు రోజూ స్కానింగ్ సదుపాయం కల్పించాలి : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

గర్భిణులకు రోజూ స్కానింగ్ సదుపాయం కల్పించాలని జనసేన నాయకులు తాహేర్ వలీ, రాజేశ్వరి, పులిరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆదోనిలోని నర్సింగ్ హోమ్‌లలో ఆరోగ్యశ్రీ పథకం వర్తించే విధంగా ప్రభుత్వం, పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలకులు, ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో అన్ని పరికరాలుండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే జనసేన ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జనసైనికులు ప్రకాష్, వెంకటేష్, అయ్యప్ప, అజయ్, శ్యామ్, వీరేష్, ఉరుకుందు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి మంత్రాలయం సమస్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మేజర్ పంచాయతీ మంత్రాలయం సమస్యలను సర్పంచి భీమయ్య మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సర్పంచుల సమావేశంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు భీమయ్య మంత్రాలయం సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయం పంచాయతీ పరిధిలో సిసి రోడ్లు, డ్రెయినేజీ మంజూరు చేయాలని కోరారు. పగలు, రాత్రి పని చేస్తున్న పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని తెలిపారు. సమావేశానికి హాజరైన ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, లేళ్ల అప్పిరెడ్డి దష్టికి సమస్యలను తీసుకెళ్లారు. వారు స్పందించి... త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రిని శాలువాతో సన్మానించి, శ్రీరాఘవేంద్ర స్వామి మొమెంటో అందజేశారు.

'ఉపాధి'కి నిధులు పెంచాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్
- బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వ్యకాస ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రెండుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయించడంలో విఫలం చెందిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి రూ.1.50 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. బడ్జెట్‌లో ఆహార భద్రతకు రూ.3 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. 8 వారాల ఉపాధి పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.అంజి బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, వ్యకాస జిల్లా నాయకులు తిక్కన్న, సిఐటియు మంత్రాలయం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, కెవిపిఎస్ మండల అధ్యక్షులు వీరేష్, కార్యదర్శి అనిల్, వ్యకాస మండల కార్యదర్శి టి.ప్రాణేష్ పాల్గొన్నారు.


మంత్రాలయంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కౌతాళం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, రైతులకు వ్యతిరేకంగా ఉందని తెలిపారు. ఈ బడ్జెట్‌తో రైతులకు ఎలాంటి మేలూ జరగదన్నారు. రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన కేంద్రం మద్దతు ధర ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధికి నిధులు తగ్గించారని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలు ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ బడ్జెట్‌లో రైతులను మోసం చేశారని తెలిపారు. రైతు సంఘం మండల కన్వీనర్ ఈరన్న, తిక్కయ్య, నాగరాజు, హనుమంతు, వలీ, బసవ పాల్గొన్నారు.


కౌతాళంలో నిరసన చేపడుతున్న నాయకులు

ఒపిఎస్ సాధన దీక్షను జయప్రదం చేయండి

- ఎస్‌టియు జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

ఈనెల 3న ఎస్‌టియు ఆధ్వర్యంలో కడప కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ఒపిఎస్ సాధన దీక్షను జయప్రదం చేయాలని ఎస్‌టియు జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప కోరారు. గురువారం ఆస్పరి జిల్లా ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌టియు మండల నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేంద్రప్ప మాట్లాడారు. తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీష్‌గడ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. ఎస్‌టియు నాయకులు జ్యోతి మూర్తి, లక్ష్మి పతి, తిమ్మప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప

గోనెగండ్ల తహశీల్దార్‌పై విచారణ చేపట్టాలి

- డీఎస్పీకి ఎంఆర్‌పిఎస్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

దళితుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తూ, ఉన్నత కులాల వారి పక్షాన ఉంటూ రూ.లక్షలు తీసుకుంటూ లంచగొండి అవతారమెత్తిన గోనెగండ్ల తహశీల్దార్ వేణుగోపాల్ శాస్త్రిపై విచారణ చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన మాదిగ చిన్న బాలన్నకు సర్వే నెంబర్ 344/2 విస్తీర్ణం ఒక ఎకరా 88 సెంట్ల భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం పొందుతున్నారని చెప్పారు. అదే గ్రామానికి చెందిన ఉన్నత కులం వారు మాదిగ చిన్న బాలన్న పొలంలో అక్రమంగా ప్రొక్లెయిన్ ద్వారా కాలువలు తీసి పంటను నాశనం చేసి రూ.3 లక్షల నష్టం కలిగించారని తెలిపారు. అక్రమంగా తవ్విన కాలువను పూడిపించి మాదిగ చిన్న బాలన్నకు అండగా ఉండాలని గోనెగండ్ల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమస్యపై స్పందించకుండా అక్రమంగా కాలువలు తీసిన వారితో రూ.4 లక్షలు ఇప్పించుకొని సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఉన్నత కులాల వారి నుంచి డబ్బులు తీసుకొని సమస్యలు పట్టించుకోకుండా దళితులపై వివక్షత చూపుతున్నారని విమర్శించారు. ఆయనపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకొని మాదిగ చిన్న బాలన్న భూమిలో అక్రమంగా తవ్విన కాలువను పూడిపించి బాధితునికి అండగా ఉండాలని కోరారు. అక్కడే ఉన్న గోనెగండ్ల ఎస్ఐ తమ్మారెడ్డిని పిలిపించి ఫోన్ ద్వారా తహశీల్దార్‌తో మాట్లాడి బైలుప్పల గ్రామంలో మాదిగ చిన్న బాలన్న భూమిలో ప్రొక్లెయినర్లతో తవ్విన కాలువను తక్షణమే పూడిపించాలని తెలిపారు.


డీఎస్పీ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ప్రజలకు ప్రయోజనం లేని బడ్జెట్

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్

ప్రజాశక్తి - ఆదోని



సమావేశంలో మాట్లాడుతున్న దేవిశెట్టి ప్రకాష్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్ విమర్శించారు. గురువారం ఆయన పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో రైతులకు, చిరు వ్యాపారులకు, వ్యాపారులకు ఎలాంటి ఉపయోగమూ లేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు గాని, వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి నిధుల కేటాయింపులు లేకపోవడం బాధాకరమని చెప్పారు. దేశంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే 90 కోట్ల మందికి ప్రాధాన్యత కల్పించలేదని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్, నిత్యావసర వస్తువుల ధర ఊసే లేదన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు తాయన్న, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష, ఐఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు జయరాం పాల్గొన్నారు.

అభిమానం వెలకట్టలేనిది

- మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజు

ప్రజాశక్తి - కౌతాళం


పుట్టినరోజు జరుపుకుంటున్న బసవరాజు

వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు చూపిన అభిమానం వెలకట్టలేదని మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజు తెలిపారు. గురువారం తన 48వ పుట్టినరోజు వేడుకలను అభిమానుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంత అభిమానం చూపిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి మాట్లాడుతూ... ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్నీ జరుపుకోవాలని, ప్రజలకు సేవలు అందిస్తూ రాజకీయరంగంలో రాణించాలని ఆకాంక్షించారు. పార్టీలకు అతీతంగా వైసిపి, టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి అభిమానుల మధ్య పుట్టినరోజు సంబరాలు జరుపుకున్నారు. మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం, ఉప సర్పంచి తిక్కయ్య, వెంకోబా, వడ్డే రాముడు, అబ్దుల్ సమ్మద్, టిడిపి నాయకులు వీరేష్ పాల్గొన్నారు.

శ్రీకౌలుట్ల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- దేవనకొండ



మండలంలో ప్రసిద్ధి చెందిన కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఛైర్మన్ హనుమంతు రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సూర్యప్రభ వాహన సేవ నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.